క్లుప్తంగా

టీషర్ట్‌ల పంపిణీ



ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో డప్పు కళాకారులకు బుధవారం కాసోజు బ్రదర్స్ ఆధ్వర్యంలో టీషర్ట్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ వెన్ను శృతిపూర్ణ చందర్, మేకల కుమారస్వామి, పోతరాజు కర్ణాకర్ పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



సంగెం : మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు పొదుపు బీమా నగదు అందించారు. ఏకశిల పొదుపు సంఘంలో సభ్యులైన రౌతు లింగయ్య, చాగంటి సూరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బుధవారం లింగయ్య భార్య భాగ్యలక్ష్మికి రూ.82,925, సూరయ్య కుమారుడు రాకేష్‌కు రూ.88,112ల బీమానగదును సంఘం అధ్యక్షుడు చిర్ర మొగిలి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు కాగితాల జగన్నాథచారి, చిర్ర ప్రకాశ్, చంద్రకాంత్, గోపి, బొజ్జ సురేష్, చింతాకుల సురేందర్, రావుల శ్రీనివాస్, రమేష్, కూచన కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారం..



సంగెం : ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. మండలంలోని మొండ్రాయి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని బందెల శ్రీనిక ఇటీవల పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో తృతీయ బహుమతి సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీనికను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి శాలువా కప్పి మెమోంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, ధనలక్ష్మి, నరసింహం, శ్రీనిక తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మధుసూదన్



చెన్నారావుపేట : చెన్నారావుపేట తహసీల్దార్ బన్సిలాల్ డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్‌తో బదిలీపై వెళ్లారు. కాగా నాయబ్ తహసీల్దార్ మధుసూదన్ తహసీల్దార్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

పరామర్శ

పర్వతగిరి : మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు లింగంపల్లి కుమార్‌రావు సతీమణి నీలమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా నీలమ్మ మృతదేహానికి కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, పోకల శంకర్, లోకేష్, మనీ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన



నర్సంపేట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నర్సంపేట 4వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి, నాయిని సునీత, ఎండి.గౌసియా, పైండ్ల సునీత, ప్రవళిక, హారిక తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో నూతనంగా రామాలయం, శివాలయాల నిర్మాణాన్ని చేపట్టారు. కాగా దేవాలయంలో ప్రతిష్ఠాన ఉత్సవాలను నేటినుంచి మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో చేపట్టనున్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతో పాటు పూజా కార్యక్రమాలను రామశంకరశర్మ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్ పిలుపునిచ్చారు.

సబ్సిడీ టార్పాలిన్ల జాడేది?

- వర్షాలతో తడుస్తున్న ధాన్యం
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పంపిణీని పునఃప్రారంభించాలని అన్నదాతల వేడుకోలు



నందిగామ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కాపాడుకునేందుకు కప్పిన టార్పాలిన్లు

నల్లబెల్లి : రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందించే టార్పాలిన్ల సరఫరా పథకాన్ని ప్రభుత్వం ఐదేళ్ల క్రితమే నిలిపివేసింది. ప్రస్తుతం వర్షాల వల్ల చేతికొచ్చిన పంట తడిసి ముద్దవుతుంది. పంటను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేసి టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం పునఃప్రారంభించాలనే డిమాండ్ వినిపిస్తుంది.

అకాల వర్షాలతో రైతుల ఆందోళన

ప్రస్తుతం వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియని పరిస్థితి.. ఈ యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న పంటలు చేతికి రాగా..అకాల వర్షాలతో మొక్కజొన్న, ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలాచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న మక్కజొన్న, వరి తడిసి ముద్దయింది. అంతే కాకుండా వర్షం తగ్గాక మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు టార్పాలిన్ల అవసరం ఉంటుంది. గతంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం టార్పాలిన్లను పంపిణీ చేసేది. కాగా, ఐదేళ్లుగా వీటి పంపిణీ నిలిపివేసింది. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2,21,345 ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉండగా, ఇందులో 1,12,578 ఎకరాల్లో వరి, 88,415 ఎకరాల్లో మొక్కజొన్న, వరి సాగు చేశారు.

రైతులపై తప్పని ఆర్థిక భారం..

గతంలో వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఉద్యాన, వ్యవసాయ శాఖల ద్వారా సబ్సిడీ టార్పాలిన్లను పంపిణీ చేసేవారు. 8–6 మీటర్ల విస్తీర్ణం కలిగిన టార్పాలిన్ అసలు ధర రూ.2,500 వరకు ఉండేది. ఇందులో 50 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వగా, మిగతా 50 శాతం రూ.1250 రైతులు చెల్లించేవారు. ఈ పథకాన్ని ప్రభుత్వం నిలిపి వేయడంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వీటిని కొనేందుకు రైతులపై అదనపు భారం పడుతోంది.

సబ్సిడీ టార్పాలిన్ అందించాలి..

సన్న, చిన్నకారు రైతులకు ఎంతో ఉపయోగపడే సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీ నిలిపి వేయడం సరైంది కాదని రైతులు వాపోతున్నారు. టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో విక్రయించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యం వర్షాలకు తడుస్తుంది. బస్తాలతో తయారు చేసిన పరదాలను రోజుకు ఒక్కోదానికి రూ.40 చొప్పున అద్దెకు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగపడే పథకాలను కొనసాగించాలని అన్నదాతలు కోరుతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళా రైతు కొగిల ప్రమీల. ఈమె తనకున్న రెండెకరాల భూమిలో వరి సాగు చేసింది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని నల్లబెల్లిలో కొనుగోలు కేంద్రానికి తీసుకచ్చింది. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు సబ్సిడీ టార్పాలిన్లు కావాలని అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వం పంపిణీ చేయడం లేదని వారు తెలిపారు. దీంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రోజుకు ఒక్కొక్క పరదాకు రూ.40 చొప్పున నాలుగు పరదాలు అద్దెకు తీసుకుంది. ఇప్పటికే 20 రోజులు పూర్తయింది. రోజుకు రూ.160 చొప్పున రూ.3,200 అద్దె చెల్లించింది. ఇలాంటి దుస్థితి ఈమెదే కాదు. జిల్లాలోని రైతులందరిది.

తప్పుడు నిర్ణయాలతో ఇబ్బంది పెట్టొద్దు

ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



రాకేష్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్ది

ఖానాపురం : కేంద్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు తీసుకొని దేశంలోని యువత, ఇతర వర్గాలను ఇబ్బందులకు గురి చేయొద్దని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గతేడాది అగ్నిపథ్‌ను వ్యతిరేకిస్తూ సికింద్రాబాద్‌లో జరిగిన ఉద్యమంలో పాల్గొని కాల్పుల్లో మృతి చెందిన దామెర రాకేష్ విగ్రహాన్ని బుధవారం మండలంలోని దబ్బీర్‌పేటలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ.. కేంద్రం తీసుకువచ్చిన అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రాకేష్ మృతి చెందడం బాధాకరమన్నారు. రాకేష్ కేంద్రానికి వ్యతిరేకంగా చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శమని, దేశ, రాష్ట్రస్థాయిలో ఉద్యమస్ఫూర్తిని నింపాడన్నారు. రాకేష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని, ఉద్యోగంతో పాటు ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించామని, భవిష్యత్‌లో కూడా అండగా ఉంటామన్నారు. దబ్బీర్‌పేటకు గృహలక్ష్మిలో ప్రాధాన్యత కల్పిస్తామని, 1/70 పరిధి గ్రామం అయినప్పటికి సీసీరోడ్ల నిర్మాణాలు చేశామని, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎస్టీలకు ఈనెల 24న పోడు భూములకు పట్టాలు ఇవ్వబోతున్నామని, బీసీలకు పొజిషన్ సర్టిఫికెట్‌లు ఇచ్చి రైతుబీమా, రైతుబంధు వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, సర్పంచ్ నీలమ్మ, ఎంపీటీసీ శంకర్, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భారతి

చెన్నారావుపేట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద నిర్వహించే చెరువుల పండుగ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ భారతి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి చెరువు వద్ద ఉత్సవాలు నిర్వహించాలన్నారు. కట్ట మైసమ్మకు మొక్కులు చెల్లించాలన్నారు. రైతులకు, గ్రామస్తులకు భోజనం ఏర్పాటు చేయాలన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. ఈ సమావేశంలో రైతు వేదిక వద్ద నిర్వహించిన ఉత్సవాలలో ఎంత నిధులు వచ్చాయో చెప్పాలన్నారు. బోడ సమ్మునాయక్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు చెప్పకుండా ఉత్సవాలను నిర్వహించడం సరికాదన్నారు. ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సరిపోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మధుసూదన్, ఎంపీఓ శ్రీధర్‌రాజు, ఏపీఎం ఈశ్వరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మంగీలాల్, ఏఎస్సై లక్ష్మణమూర్తి, తదితరులు ఉన్నారు.

పట్టణ మేరు సంఘం కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న బాధ్యులు

నర్సంపేట : నర్సంపేటలోని మేరు సంఘం భవనంలో బుధవారం పట్టణ మేరు సంఘం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా రామగిరి రవికుమార్, ప్రధాన కార్యదర్శి గట్ల రజనీకాంత్, కోశాధికారి గంగాపురం ప్రకాశ్, ఉపాధ్యక్షులుగా గట్ల కమలాకర్, రామగిరి నాగరాజు, గట్ల శ్రీనివాస్, రామగిరి వెంకటనర్సు, ఓదెల రవీందర్, కార్యదర్శులుగా కడప లక్ష్మణ్, రామగిరి రవీందర్, ఆర్‌ఆర్ నోముల భాస్కర్, బొమ్మిదేని రమేష్, సంఘ సత్యనారాయణ, నిర్వాహక కార్యదర్శులుగా రామగిరి రాజు, ఓదెల సురేష్, రాయబారపు శివకుమార్, ఓదెల వీరన్న, ఓదెల రాజేందర్‌లను ఎన్నుకున్నారు. జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ పెండ్యాల హరిప్రసాద్, కో కన్వీనర్ దోమకొండ శ్రీనివాస్, ఎన్నికల పరిశీలకులు కొత్తకొండ విద్యాసాగర్, ఎన్నికల అధికారి గూడూరు బాలాజీ తదితరులు ఉన్నారు.

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: ఇంటికన్నె – నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య ఇంటికన్నె రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెందాడని జీఆర్పీ సీఐ నరేష్ బుధవారం తెలిపారు. 30 – 35 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పూర్తి వివరాలకు 94403 61941, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బడీడు పిల్లల్ని బడిలో చేర్చాలి



నెక్కొండ: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



దుగ్గొండి: మందపల్లిలో..

నెక్కొండ : బడీడు పిల్లల్ని బడిలో చేర్చాలని ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. మండలంలోని పనికర గ్రామంలో బుధవారం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి బడీడు పిల్లల వివరాలను తెలుసుకొని ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరారు. మన ఊరు–మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల వద్దకు సైతం వెళ్లి కూలీలకు కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

దుగ్గొండి : విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు మోజులో పడి ఆర్థికంగా సమస్యలు కొనితెచ్చుకోవద్దని, చక్కని విద్యను అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని మందపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం కర్ణకంటి రామ్మూర్తి భరోసా ఇచ్చారు. గ్రామంలో బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసిక నిరోష, వార్డు సభ్యులు రేవూరి వెంకటరెడ్డి, మారేడుగొండ రాజేష్, రఘుసాల బాబురావు, ఏసీక రాజేశ్వర్‌రావు, గణేష్, శ్రీను పాల్గొన్నారు.

రాజీమార్గంతో కేసులకు పరిష్కారం

ఖిలా వరంగల్: జూన్10న వరంగల్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఉందని, ఈక్రమంలో స్టేషన్ పరిధిలో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశం ఉందని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాది, ప్రతివాదులు ఇరువురు స్టేషన్‌కు వస్తే 10వ తేదీన వారిని కోర్టులో ప్రవేశపెట్టి కేసులను ముగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రధానంగా యాక్సిడెంట్, కొట్టుకున్న కేసులు, చీటింగ్, చిట్‌ఫండ్, భూ తగాదాలు, వివాహ బంధానికి సంబంధించిన, చిన్న, చిన్న దొంగతనాలు, అక్రమ రవాణా (ఇసుక, మట్టి, కట్టెలు, మద్యం, ఇతర కేసులు), పేకాట, లాక్‌డౌన్, ట్రాఫిక్, ఫ్యామిలీ గొడవలు, గుట్కా వంటి కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

సంకటహర చతుర్థి పూజలు

కాజీపేట: సంకటహర చతుర్థి పూజలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి బుధవారం సహస్ర జలాభిషేకం జరిపించారు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ జలాభిషేకం నిర్వహించారు. అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక హోమం, పూజలు చేశారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి



అంబేడ్కర్ సెంటర్‌లో మాట్లాడుతున్న చెన్నకేశవులు

నెక్కొండ : ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం తక్షణమే ఇళ్ల పట్టాలను అందించాలని సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో గుడిసెవాసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఆయన మాట్లాడతూ.. ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకంలో గుడిసెవాసులను చేర్చి, నిరుపేదలను ఆదుకోవాలని కోరారు. అలాగే ఈ నెల 11న భద్రాద్రి కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజాగర్జన మహా సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లస్వామి, రాంచందర్, వెంకటలక్ష్మి, దేవపాల, నర్సింహస్వామి, రఫీయా, నీలమ్మ, సరిత, సావిత్రి, పద్మ, ప్రమీల, ఉమ, శ్రీలత పాల్గొన్నారు.

హ్యాపీ బర్త్‌డే.. చిన్నారి

నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కూతురు పుట్టినరోజు బుధవారం కావడం.. ఇదే రోజు ములుగుజిల్లాలోని రామప్ప పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి తారకరామారావు కేక్ కట్ చేయించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



చిన్నారితో కేక్ కట్ చేయిస్తున్న మంత్రులు

బీఆర్‌ఎస్ నాయకుడిపై మున్సిపల్ కమిషనర్ దాడి



ఫిర్యాదు చేస్తున్న సారంగపాణి

వర్ధన్నపేట : మున్సిపల్ కమిషనర్ రవీందర్ తనను కులం పేరుతో దుర్భాషలాడడంతో పాటు దాడి చేయగా కాలికి గాయమైందని స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు మాజీ జెడ్పీటీసీ, 7వ వార్డు కౌన్సిలర్ భర్త పాలకుర్తి సారంగపాణి తెలిపిన వివరాల ప్రకారం.. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాగునీటి దినోత్సవ ఏర్పాట్ల కోసం తన భార్య కౌన్సిలర్ సుజాతకు మున్సిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్ ఫోన్ చేసి మున్సిపల్ కార్యాలయానికి రావాలని తెలిపారు. అయితే తన భార్యకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో తాను మున్సిపల్ కార్యాలయం అక్కడి నుంచి కోనారెడ్డి చెరువు వద్దకు వెళ్లాడు. తన కోసం పది నిమిషాలు ఆగలేరా సార్.. అని కమిషనర్‌ను అడగడంతో 'నీ గురించి నాకు అవసరం లేదురా' అని కులం పేరుతో నానా బూతులు తిట్టాడంతో పాటు తన షర్టు పట్టుకుని లాగి అక్కడే ఉన్న గొడ్డలి కామతో తన మోకాలిపై కొట్టగా కాలికి గాయం అయిందన్నారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయమైన కమిషనర్ రవీందర్‌ను వివరణ కోరగా సారంగపాణి అతిగా మద్యం సేవించి వచ్చి తనను దుర్భాషలాడాడని, ఆయనపై తాను దాడి చేయలేదని, తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలియదన్నారు. ఈ విషయంపై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందింది వాస్తవమేనని, బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తామన్నారు.

ఆస్పత్రిలో గైనిక్ డాక్టర్ల కరువు?

- నలుగురు డాక్టర్లకు.. ఇద్దరే డ్యూటీలో..
- ఒకరు సెలవుపై వెళ్తే.. మరొకరికి అదనపు బాధ్యతలు
- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు



నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి

నర్సంపేట రూరల్ : గర్భిణులకు వైద్యం అందించేందుకు వైద్యులు కరువయ్యారు. నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మొత్తం నలుగురు డాక్టర్లకు ఇద్దరే డ్యూటీలో ఉండగా.. ఇటీవల ఓ వైద్యురాలిని డిప్యూటేషన్‌పై వర్ధన్నపేట ఆస్పత్రికి పంపించారు.. మరొక పోస్టుకు ఇంత వరకు ఎవరు రాకపోవడంతో అది ఖాళీగానే ఉంది, దీంతో ఇద్దరు వైద్యులలో ఒకరు సెలవుపై వెళ్తే... మరొకరికి అదనపు బాధ్యతలు తప్పడంలేదు. దీంతో గర్భిణులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి డివిజన్‌లోని నర్సంపేట, ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ, నల్లబెల్లి, దుగ్గొండి మండలాలతోపాటు సంగెం, పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం, ములుగు జిల్లాలోని మల్లంపల్లి మండలాల నుంచి గర్భిణులు అధిక సంఖ్యలో వైద్యం కోసం వస్తుంటారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి రోజు ఓపీ సుమారు 50–60వరకు గర్భిణిలదే. ప్రతి నెల 100 నుంచి 150మధ్య ప్రసవాలు నిర్వహించడం జరుగుతోంది. ఈ ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులను పరీక్షించేందుకు, ప్రసూతిలు నిర్వహించేందుకు మొత్తం నలుగురు డాక్టర్లను ప్రభుత్వం కేటాయించింది. నర్సంపేట ఆస్పత్రిలో ముగ్గురు గైనకాలజిస్టు డాక్టర్లు పూర్ణిమ, నవత, సింధూరాలు ఉన్నారు. ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టుకు రావడానికి ఎవరు సుముఖంగా లేకపోవడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంటూ వస్తోంది. అయితే గత మూడు నెలల క్రితం విధుల పట్ల ఆలసత్వం, తదితర కారణాలతో సింధూరాను నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వర్ధన్నపేట ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి ఇద్దరే గైనిక్ వైద్యులు మిగిలారు. ఇటీవల పూర్ణిమ గత రెండు వారాలుగా రావడంలేదు. దీంతో ఉన్న డాక్టర్ నవతనే ఆస్పత్రికి పెద్దదిక్కుగా మారింది. ఒక డాక్టర్ తోనే గత రెండువారాలుగా కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు సెలవుపై ఏ వైద్యురాలు వెళ్లినప్పటికీ మిగతా వైద్యురాలికి అదనపు బాధ్యతలు తప్పడంలేదు. రోజురోజుకు గర్భిణీల సంఖ్య పెరుగుతుండడంతో వైద్యులు సరిగా లేకపోవడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రసూతిలు నిర్వహించి, ఓపీలు కూడా ఒక్కరే చూడాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో అయితే ఒక వైద్యురాలు ఓపీ చూస్తే, మిగతా ఇద్దరు ప్రసూతిలు నిర్వహించే వారు, వైద్యురాలు సెలవులో ఉంటే ఒకరు ఓపీ చూసి, మరొకరు ప్రసూతిలు నిర్వహించడం జరుగుతుంది. ఇప్పుడు ఒక్క వైద్యురాలే ఓపీ, ప్రసూతిలు నిర్వహించడం కష్టంగా మారింది. దీంతో గర్భిణులు ఆస్పత్రికి వస్తే అధిక సమయం వేచి చూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డిప్యూటేషన్‌పై వెళ్లిన వైద్యురాలి స్థానంలో మరొక వైద్యురాలిని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి గర్భిణులకు వైద్యం అందించాలని పలువురు కోరారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..



నర్సంపేట ఆస్పత్రికి గైనకాలజిస్టు పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ కాలేదు. ఇటీవల ఓ వైద్యురాలిని డిప్యూటేషన్‌పై వర్ధన్నపేటకు పంపించడంతో ఇద్దరు వైద్యులకు అదనపు భారం పడుతోంది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం, వారి ఆదేశాల మేరకు నియామకాలు చేపడతాం.

– డాక్టర్ గోపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్

'డంపింగ్ యార్డును తరలించే వరకు ఉద్యమిస్తాం'

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి

మడికొండ: మడికొండలోని డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో చుట్టపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాన్ని అక్కడి నుంచి వేరే చోటుకు తరలించే వరకు బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి హెచ్చరించారు. మడికొండ డంపింగ్ యార్డును పార్టీ నాయకులతో కలిసి రాకేష్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగతో పరిసర ప్రాంతాల ప్రజలు శ్వాసకోస సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో డంపింగ్ యార్డు నగరానికి దూరంగా, జన సమర్థంలేని ప్రాంతానికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం మహేందర్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పల్లపు అశోక్, వల్లెపు రాజు, ఎత్తరి ప్రేమ్‌రాజ్, శివశంకర్, ఎత్తరి అనిల్, పవన్, కార్తీక్, శివ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.